వాయిదా వెనుక.. కారణం ఇదేనా?

● హంద్రీ-నీవా కాలువలో పూర్తిస్థాయిలో లేని నీటి ప్రవాహం ● పది రోజుల గడువు కోరిన ఇంజనీర్లు

సీఎం పర్యటన రద్దు

● అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలే కారణమంటున్న వైసీపీ వర్గాలు

చిత్తూరు కలెక్టరేట్/రామకుప్పం, ఫిబ్రవరి 1: సీఎం జగన్మోహన్‌రెడ్డి సోమవారం నాటి రామకుప్పం మండల పర్యటన రద్దయింది. తిరిగి ఎప్పుడు ఉంటుందనేది ప్రకటించాల్సి ఉంది. ఈనెల 5న హంద్రీ-నీవా కాలువను ప్రారంభించడంతో పాటు ఆసరా సమావేశం, బహిరంగ సభలో సీఎం పాల్గొనాల్సి ఉంది. దీనికిగాను గురువారం కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, జిల్లా అధికారులందరూ సీఎం పర్యటన ఏర్పాట్లకోసం వెళ్లారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో జేసీ శ్రీనివాసులు అధ్యక్షతన సీఎం పర్యటన ఏర్పాట్లపై సమావేశమూ జరిగింది. తిరిగి సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లో మంత్రి పెద్దిరెడ్డి అధ్యక్షతన జిల్లా అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమావేశం జరుగుతుందని వర్తమానం వెళ్లింది. ఆ తర్వాత సాయంత్రానికంతా సీఎం పర్యటన రద్దయినట్లు సమాచారం వచ్చింది. ఈ నెల 5వ తేది నుంచి మూడు రోజులపాటు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో పర్యటన రద్దయినట్లు అనధికారికంగా తెలిసింది. అసెంబ్లీ సమావేశాల తర్వాతే సీఎం పర్యటన ఉంటుందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అంతకుముందు, జిల్లా అధికారులతో కలిసి ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు మండలంలో పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.


పెద్దబరిణేపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువలో లిఫ్టునకు అందని నీళ్లు

వి.కోట, ఫిబ్రవరి 1: సీఎం పర్యటన వాయిదా వెనుక హంద్రీ నీవా కాలువలో పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం లేకపోవడమే కారణమని తెలుస్తోంది. ఎన్నికల్లోగా కుప్పం నియోజక వర్గానికి హంద్రీ నీవా నీటిని అందించేశామని చెప్పుకొనేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టింది. హడావిడిగా హంద్రీ నీవా కాలువ ప్రారంభోత్సవం చేపట్టారు. ఆ సమయంలో నీటి ప్రవాహం లేకుంటే బాగుండదనే ఉద్దేశంతో పర్యటనను వాయిదా వేసినట్లు విశ్వసనీయ వర్గాలు చెప్పాయి. వివరాలిలా ఉన్నాయి. వి.కోట మండలం పెద్దబరిణేపల్లె పంప్‌హౌస్ నుంచి రామకుప్పం మండలం వర్థికుప్పానికి నీళ్లు చేరడంతో కుప్పం నియోజకవర్గాన్ని హంద్రీ నీవా జలాలు తాకాయి. దీంతో జగన్ ప్రభుత్వ హయంలో హంద్రీ-నీవా జలాలను కుప్పానికి ఇచ్చారంటూ వైసీపీ నేతలు ప్రచారం ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 5న రామకుప్పం పర్యటన ఖరారు చేశారు. ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా గురువారం కలెక్టరు షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి వి.కోటకు చేరుకున్నారు. జడ్పీ బంగ్లాలో ఇరిగేషన్ అధికారులతో హంద్రీ-నీవా కాలువలో నీటి సామర్థ్యంపై ఆరా తీశారు. అనంతరం జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్‌తో కలసి కలెక్టర్, ఎస్పీ వర్థికుప్పం వద్ద కాలువలో నీటి ప్రవాహాన్ని చూసి అసంతృప్తికి లోనయ్యారు. కనీసం కుప్పం పరిధిలో కొన్ని చెరువులను నీటితో నింపి ఆపై సీఎం పర్యటన ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చారు. వి.కోట చేరుకున్న కలెక్టర్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. పుంగనూరు హంద్రీ నీవా కాలువ నుంచి నెల రోజులుగా పలు లిఫ్టుల ద్వారా వి.కోట మండలం మోట్లపల్లె పంప్‌హౌస్‌కు.. అక్కడ్నుంచి పెద్దబరిణేపల్లె మీదుగా రామకుప్పం మండలానికి నీటిని తీసుకురాగలిగామన్నారు. 'ఈడిగపల్లె వద్ద ఓచోట, మాడీ వద్ద మరో చోట కాలువకు గండి పడింది. దీంతో ఎక్కడి నీరు అక్కడే గండ్ల ద్వారా బయటకు వెళ్లడంతో కాలువలో నీటి ప్రవాహం తగ్గింది. రెండు చోట్ల గండ్లను పూడ్చే ప్రయత్నం చేపడతున్నాం. ఈ రెండు గండ్లు పూర్తిగా పూడిస్తే మరో పది రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిని రామకుప్పానికి తీసుకు రావచ్చు. ప్రస్తుతం వచ్చిన నీరు పెద్దబరిణేపల్లె పంప్ హౌస్ నుంచి లిఫ్ట్ చేయగా వర్థికుప్పంకు చేరుకుంది. అయితే నిరంతరాయంగా లిఫ్ట్ చేసేందుకు తగినంత నీరు అందుబాటులో లేదు. దీంతో నీళ్లున్నప్పుడు లిఫ్టును వాడి.. ఆపై ఆపేస్తున్నాం. పది రోజులు నిరంతరాయంగా నీళ్లు వస్తే కనీసం రెండు, మూడుచెరువులు నింపవచ్చు'అని ఇరిగేషన్ ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికారులు సీఎంవోకు చెప్పడంతో పర్యటన వాయిదా వేసినట్లు సమాచారం. హంద్రీ-నీవా కాలువలో పూర్తి స్థాయిలో నీటిని కుప్పానికి తీసుకొచ్చి.. ఆపై పర్యటన తేదిని ఖరారు చేయనున్నట్లు వైసీపీ నేతలు 'ఆఫ్ ది రికార్డు'గా చెబుతున్నారు.


వి.కోట జడ్పీ బంగ్లాలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ


వర్థికుప్పం వైపు కాలువలో ఇంకిపోయిన నీరు

ఏమైందో పాపం..!


ప్రభుత్వాస్పత్రిలో చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

పలమనేరు సమీపం సాయినగర్‌లో నివాసం ఉంటున్న హరికృష్ణ రెండేళ్ల కుమార్తె దేవాన్షి అపస్మారక స్థితిలో ఉండగా గురువారం మధ్యాహ్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి గొంతువద్ద కందిపోయి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. 'ఈ చిన్నారి రెండు రెండు మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలో జోలలో ఆడుకొంటూ కిందపడింది. వెంటనే గమనించి కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకొచ్చారు' అని పోలీసులు తెలిపారు. - పలమనేరు

అంతా తొండాట

● ఆడుదాం ఆంధ్రలో ఇతర రాష్ట్రాల క్రీడాకారులను ఆడిస్తున్న జట్లు ● పట్టించుకోని అధికారులు

'ఆడుదాం ఆంధ్ర'లో తొండాట జరుగుతోందా? ఇతర రాష్ట్రాల క్రీడాకారులనూ ఆడిస్తున్నారా? ఎవరు.. ఎవరిని ఆడిస్తున్నారో తెలియని నిర్లక్ష్య స్థితిలో అధికారులు ఉన్నారా? గురువారం నాటి పరిణామాలు.. ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తోంది.

- చిత్తూరు క్రీడలు


నిరసన తెలుపుతున్న జీడీ నెల్లూరు నియోజకవర్గ కబడ్డీ క్రీడాకారులు

ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణలో జరిగిన అక్రమాలు జిల్లా స్థాయి పోటీల్లో ఒక్కొక్కటిగా వెలుగు చుస్తున్నాయి. బుధవారం జీడీనెల్లూరు, కుప్పం జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో కుప్పానికి చెందిన జట్టులో తమిళనాడుకు చెందిన క్రీడాకారులను ఆడించారని జీడీ నెల్లూరు జట్టు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కుప్పం జట్టు సభ్యులను పరిశీలించాలని అధికారులు మళ్లీ చిత్తూరుకు రావాలని కోరారు. అయితే వారు రాకపోవడంతో రెండో సెమీఫైనల్‌లో పూతలపట్టు జట్టుతో ఆడి గెలిచిన నగరి జట్టును అధికారులు విజేతలుగా ప్రకటించారు. దీంతో జీడీనెల్లూరు నియోజకవర్గ జట్టు సభ్యులు మెసానికల్ మైదానం ఎదుట నిరసన తెలిపారు. కుప్పం జట్టులో ఆడిన క్రీడాకారులు బోగస్ అని తెలిసే వారు గురువారం జరగనున్న ఫైనల్ మ్యాచ్‌కు రాలేదని, వారిని డిస్‌క్వాలిఫై చేసి తమతో నగరి జట్టును ఆడించాలని మెసానికల్ మైదానం ఎదుట కూర్చొని ధర్నా చేశారు. పోలీసుల రంగప్రవేశంతో ధర్నాను విరమించి అధికారులతో చర్చించారు.

● అదేవిధంగా, బుధవారం క్వార్టర్ ఫైనల్‌లో నగరితో చిత్తూరు జట్టు తలపడింది. ఇందులో నగరి జట్టు విజేతగా నిలిచింది. అయితే నగరి జట్టులోనూ బోగస్ ఆటగాళ్లు ఆడారని చిత్తూరు జట్టు సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

నగరిని గెలిపించాలనే..

నగరికి చెందిన క్రీడల మంత్రి అయిన రోజా కోసమే రెండో సెమీఫైనల్‌లో నెగ్గిన నగరి జట్టును విజేతలుగా చేయాలని అధికారులు తాపత్రయం పడుతున్నారంటూ జీడీ నెల్లూరు నియోజకవర్గ క్రీడాకారులు ఆరోపించారు. కుప్పం జట్టు డిస్‌క్వాలిఫై అయితే.. ఆ తర్వాతి స్థానంలో ఉన్న జీడీ నెల్లూరు జట్టును నగరితో ఆడించాలన్నారు. అలా చేయకుండా నగరిని ఎలా విజేతలుగా ప్రకటిస్తారంటూ అధికారుల తీరుపై నిరసన తెలిపారు. వీరి నిరసనను పట్టించుకోని అధికారులు నగరి కబడ్డీ జట్టును విజేతగా ప్రకటించారు. పూతలపట్టు జట్టుతో రెండో సెమీఫైనల్స్ ఆడిన నగరి జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. పూల్ ఏ ఫైనల్స్‌కు చేరిన కుప్పం జట్టు రాకపోవడంతో నగరి జట్టును విజేతగా ప్రకటించారు. కుప్పం జట్టులో ఇతర క్రీడాకారులను ఆడించారని కారణంగా కుప్పంను డిస్‌క్వాలిఫై చేస్తూ వారితో ఆడి ఓడిన జీడీనెల్లూరు జట్టుకు రెండు.. రెండో సెమీఫైనల్‌లో ఓడిన పూతలపట్టుకు మూడోస్థానం ఇచ్చారు.

అమ్మో.. చిరుత!



గుడిపాల మండలం పశుమంద సమీప ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి చిరుత సంచారం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ చిరుత సంచారం ఫొటోను ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేపడుతున్న వారు గుర్తించారు. సెల్‌ఫోనులో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. ఆ చిరుత అటవీ ప్రాంతం వైపు వెళ్లింది. మళ్లీ ఎక్కడ వస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులను సంప్రదించగా.. అలాంటిదేమీ లేదని పేర్కొన్నారు.

- గుడిపాల

కాపలాదారుపై దాడి!

● రెండు చిరుతలు వచ్చాయంటున్న బాధితులు

పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మామిడితోటలో గురువారం వేకువజామున రెండు చిరుతలు హల్‌చల్ చేశాయి. వీటి దాడిలో కాపలాదారుడు రవి గాయపడ్డారు. కాపలాదారు భార్య భాగ్యమ్మ తెలిపిన ప్రకారం.. సోమల మండలం వినాయకపురం ఎస్టీ కాలనీకి చెందిన రవి దంపతులు ఐదేళ్లుగా ఇక్కడి మామిడితోటలో కాపాలాదారుగా ఉంటున్నారు. గురువారం వేకువజామున 3 గంటల సమయంలో మామిడితోటలోని పశువులు గట్టిగా అరవడంతో రవి వెళ్లారు. ఇతడిని గమనించిన రెండు చిరుతలు వెళ్లిపోతూ దాడి చేయడంతో.. భుజం, వీపై గాయాలయ్యాయి. ఈ పరిణామంతో భయపడిన రవి అపస్మారక స్థితికి చేరుకున్నారు. చిరుతుల దాడి గమనించిన భాగ్యమ్మ.. మరొకరి సాయంతో రవిని ద్విచక్రవాహనంలో సదుం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అతడికి ఎలాంటి ఇబ్బంది లేదని, రెండు రోజులు ఆస్పత్రిలో ఉండాలని వైద్యులు చెప్పినట్లు ఆమె తెలిపారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి ఆస్పత్రికి చేరుకొని రవిని పరామర్శించారు. కాగా, సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, ఆ ప్రాంతంలో పశువులు తిరగడంతో చిరుతలు సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించలేదని మంగళంపేట సెక్షన్ ఎఫ్‌బీవో నిఖిల్ తెలిపారు.

- కల్లూరు


చికిత్స పొందుతున్న రవి

జిల్లాకు నలుగురు కొత్త డీఎస్పీలు

● జిల్లా నుంచి బయటికి ఐదుగురు ● నాయుడుపేట నుంచి చిత్తూరుకు రాజగోపాల్‌రెడ్డి ● నంద్యాల నుంచి పలమనేరుకు మహేశ్వర్‌రెడ్డి ● భీమవరం నుంచి కుప్పానికి శ్రీనాథ్ ● కర్నూలు దిశ నుంచి చిత్తూరు దిశకు సుధాకర్‌రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడేళ్లు పూర్తి చేసుకున్న డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లా నుంచి ఐదుగురు ఇతర జిల్లాలకు వెళ్లగా, బయటి నుంచి జిల్లాకు నలుగురు వస్తున్నారు. కీలకమైన చిత్తూరు, పలమనేరు సబ్ డివిజన్లకు అధికారపార్టీకి చెందిన సామాజికవర్గ డీఎస్పీలు రావడం గమనార్హం. ఇన్నాళ్లూ కుప్పానికి డీఎస్పీని నియమించకపోగా, ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా అక్కడ అధికారిని నియమించారు. నగరి డీఎస్పీ బదిలీ అవ్వగా ఆయన స్థానంలో కొత్తవారు రాలేదు.

సుధాకర్‌రెడ్డి.. నాలుగేళ్లు మూడు కీలకస్థానాలు



జిల్లాలో నాలుగేళ్ల పాటు కీలకమైన మూడు స్థానాల్లో పనిచేసిన డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఎన్నికల నేపథ్యంలో ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. 2020లో సుధాకర్‌రెడ్డి చిత్తూరు ఎస్బీ డీఎస్పీగా ఏడాది పనిచేసి, 2021-2022 మధ్యకాలంలో రెండేళ్ల పాటు చిత్తూరు టౌన్ డీఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత 2023 నుంచి ఏడాది పాటు పలమనేరు డీఎస్పీగా ఉన్నారు. జిల్లా లాఅండ్ ఆర్డర్‌లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ను బదిలీ చేశారు. గతేడాది జనవరి 4వ తేదీన కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటనను జీవో 1 పేరుతో అడ్డుకోవడం, లోకేశ్ యువగళం పాదయాత్రకు అడ్డంకులు సృష్టించి టీడీపీ నాయకుల మీద కేసులు పెట్టడం, పుంగనూరు అల్లర్లలో టీడీపీ శ్రేణుల మీద పెద్దఎత్తున హత్యాయత్నం కేసుల నమోదు వంటి వివాదాల్లో ఈయన ప్రధాన పాత్ర పోషించారు. మంత్రి పెద్దిరెడ్డి సహా వైసీపీ నాయకులకు అనుకూలంగా ఉంటూ ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టారని ఈయన మీద టీడీపీ నాయకులు నిత్యం ఆరోపణలు చేస్తుంటారు.

బాబుప్రసాద్.. మళ్లీ అప్రాధాన్య పోస్టుకే



చిత్తూరు దిశ డీఎస్పీ బాబుప్రసాద్ కర్నూలు జిల్లా దిశ డీఎస్పీగా మార్చారు. చిత్తూరులో ప్రాధాన్యత లేని పోస్టులో ఏళ్లగా పనిచేసిన ఈయన్ను మళ్లీ అలాగే ప్రాముఖ్యత లేని పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలో జరిగిన యువగళం పాదయాత్రకు ఈయన సమన్వయ అధికారిగా వ్యవహరించారు. పుంగనూరులో చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకున్న ఘటనలో పోలీసులు, టీడీపీ శ్రేణులు రాళ్లు రువ్వుకున్న విషయం తెలిసిందే. ఆ ఘటనలో బాబుప్రసాద్ తలకు బలమైన గాయమైంది.

చిత్తూరు డీఎస్పీకి పనిష్మెంట్



చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తికి తాజా బదిలీల్లో పనిష్మెంట్ వచ్చినట్లు అయింది. చిత్తూరు నుంచి ఏకంగా రాజమండ్రి సీసీఎస్ సెల్‌కు మార్చారు. చాలా దూరం మార్చడంతో పాటు అక్కడ సబ్‌డివిజన్ ఇవ్వకుండా అప్రాధాన్య పోస్టింగ్ ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టిలో ఈయనకు మంచి పేరు లేకపోవడంతోనే ఇలా పనిష్మెంట్ లభించిందని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈయన 2020 చివర్లో చిత్తూరు సీసీఎస్‌కు వచ్చారు. 2022 చివర్లో అనుకోకుండా చిత్తూరు సబ్‌డివిజన్ అధికారిగా పోస్టింగ్ దక్కింది. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఈయన బలమైన సామాజికవర్గానికి చెందిన ఉన్నతాధికారులు, కింది స్థాయి అధికారులతో ఇబ్బందులు పడ్డారని ప్రచారముంది.

ఎస్బీ డీఎస్పీకి మంచి పోస్టింగ్



చిత్తూరు ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి మంచి పోస్టింగ్ లభించింది. డీఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత కొన్నాళ్లు కడప ట్రాఫిక్‌లో, ఏడాదిన్నర చిత్తూరు ఎస్బీలో పనిచేశారు. తాజా బదిలీల్లో నాయుడుపేటలో పోస్టింగ్ లభించింది. ఈయనపైనా అధికార పార్టీకి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలున్నాయి. పుంగనూరు అల్లర్లు, యువగళం పాదయాత్ర అంశాల్లో ఎస్బీ విభాగం సమర్థంగా పనిచేయలేదనే చర్చ ఉంది. చిత్తూరులో జరిగిన గంగమ్మ జాతరలో టౌన్ డీఎస్పీ శ్రీనివాసమూర్తికి, ఈయనకు మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఇద్దరూ ఒకే బ్యాచ్ కావడంతో సఖ్యత ఉండేది కాదు.

జిల్లాకు వచ్చిన డీఎస్పీలు వీళ్లే


రాజగోపాల్‌రెడ్డి - శ్రీనాథ్ - మహేశ్వరరెడ్డి

చిత్తూరుకు నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వస్తున్నారు. కడప జిల్లాకు చెందిన ఈయన గతంలో చిత్తూరు వెస్ట్ సీఐగా పనిచేశారు. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి పలమనేరుకు, భీమవరం డీఎస్పీ శ్రీనాథ్ కుప్పానికి, కర్నూలు దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి చిత్తూరు దిశకు బదిలీపై వచ్చారు. 2022లో కుప్పం సబ్ డివిజన్ ఏర్పడ్డాక డీఎస్పీగా ఎవరినీ నియమించలేదు. పలమనేరు డీఎస్పీ ఇన్‌ఛార్జీగా ఉన్నారు. ఇప్పుడు భీమవరం నుంచి వస్తున్న డీఎస్పీ డైరెక్ట్ ఆఫీసర్.

కొత్త డీఎస్పీలకు ఎన్నికల సవాల్

జిల్లాలో ఇన్నాళ్లు పనిచేసిన ఎస్పీ సహా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు వైసీపీకి అనుకూలంగా పనిచేస్తూ, ప్రతిపక్షాలను అక్రమ కేసులతో వేధించారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా వస్తున్న డీఎస్పీలు కీలకమైన ఎన్నికల సమయంలో పలు సవాళ్లను ఎదుర్కోక తప్పదు. ఎన్నికల్లో ఇరుపక్షాల వారిని సమానంగా చూడకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే ఈసీ ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది.

తహసీల్దార్లకు మండలాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోన్-4 పరిధిలోని అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల నుంచి బదిలీపై చిత్తూరు జిల్లాకు వచ్చిన తహసీల్దార్లలో 31 మందికి మండలాలు కేటాయిస్తూ గురువారం కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. వీరు వెంటనే వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది జూన్ 30 నాటికి మూడేళ్ల పదవీకాలం పూర్తవ్వని, జూన్ 30 నాటికి పదవీ విరమణ చేయనున్న 10 మంది తహసీల్దార్లను ఎన్నికేతర విభాగాల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

● పెద్దపంజాణిలో పనిచేస్తున్న బి.లోకేశ్వరరావును గంగవరానికి, తిరుపతి జిల్లా బి.ఎన్.కండ్రిగలో పనిచేస్తున్న జి.శివయ్యను వెదురుకుప్పానికి బదిలీ చేశారు. చిత్తూరు కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న పి. వెంకటేశ్వరన్‌ను కలెక్టరేట్ ఏవోగా, పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఎం. ప్రసాద్ బాబును కలెక్టరేట్ భూసేకరణ విభాగ ఏవోగా నియమించారు. పలమనేరులో పనిచేస్తున్న ఈజీ కుప్పస్వామిని పలమనేరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, పూతలపట్టులో పనిచేస్తున్న వై. విజయభాస్కర్‌ను చిత్తూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, ఐరాలలో పనిచేస్తున్న పి.సుశీలను చిత్తూరు కలెక్టరేట్‌లోని కోఆర్డినేషన్ సెక్షన్‌కు సూపరింటెండెంట్‌గా, తవణంపల్లిలో పనిచేస్తున్న కె. గుణశేఖర్‌రెడ్డిని చిత్తూరు కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, విజయపురంలో పనిచేస్తున్న పి. వెంకట్రాయులును కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగ సూపరింటెండెంట్‌గా నియమించారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో కొనసాగుతున్న సోమల తహసీల్దార్ ఎస్. షబార్ బాషాను చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో కేఆర్ఆర్సీ తహసీల్దార్‌గా నియమిస్తూ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

మండలాల కేటాయింపుల వివరాలిలా వున్నాయి ....

● **ఉమ్మడి అనంతపురంజిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్లు..** కె.విజయలక్ష్మి (గుడిపాల), ఎ.హరికుమార్ (కుప్పం), డి.వసంతలత (పులిచెర్ల), ఇ.నాగరాజు (సోమల), టి.నారాయణస్వామి (సదుం), డి.నీలకంఠారెడ్డి (చౌడేపల్లె), వై.రంగనాయకులు (పలమనేరు), జి. నాగేంద్ర (పెద్దపంజాణి), సయ్యద్ షాబుద్దీన్ (గుడుపల్లె), పి.సుబ్బలక్ష్మమ్మ (పాలసముద్రం), కె.శ్రీధర్ (రామకుప్పం), స్వర్ణలత (బైరెడ్డిపల్లె), ఎ.సురేష్ కుమార్ (వి.కోట), టి.ఆర్.మురళీకృష్ణ (శాంతిపురం).

● **కడప జిల్లా నుంచి వచ్చిన..** పి.శ్రీనివాసరెడ్డి (చిత్తూరు అర్బన్), ఎన్.చంద్రశేఖర్ రెడ్డి (నగరి), ఎం.వి. సుబ్రహ్మణ్యంరెడ్డి (పుంగనూరు), ఎం.దైవాదీనం (యాదమరి)కి మండలాలు కేటాయించారు.

● **ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్లు..** కె.నాగమణికి (నింద్ర), షేక్ హసీనాబీ (తవణంపల్లె), టి.శ్రీనివాసులు (ఐరాల), డి.ఆల్ఫ్రెడ్ (శ్రీరంగరాజపురం), జి.వి.మల్లికార్జున రావు (విజయపురం), పి.షేక్ మొహిద్దీన్ (రొంపిచెర్ల), జి.సుభద్రమ్మ (బంగారుపాళ్యం), ఎం.శివరాముడు (పూతలపట్టు), ఎస్.సుభద్ర (పెనుమూరు), బి.పుష్పకుమారి (కార్వేటినగరం), ఐ.వేణుగోపాల్‌రావు (కుప్పం ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి), ఎస్.రవి (గంగాధరనెల్లూరు), డి. చంద్రశేఖర్ (నగరి ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి)గా నియమితులయ్యారు.

మేటిమంద వద్ద జంట ఏనుగులు

సోమల, ఫిబ్రవరి 1: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం డ్యాం వద్ద బుధవారం రాత్రి జంట ఏనుగులు సంచరించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. డ్యాం సమీప మామిడి లో జంట ఏనుగులు డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. నడింపల్లె, మాలపల్లె, దాదెంగొల్లపల్లె పరిసరాల్లో సంచరించి గురువారం పగలు మేటిమంద పొలాల వద్ద ఏనుగుల సంచారం ను రైతులు గుర్తించి ఇళ్లకు చేరుకున్నారు. మూడేళ్ల క్రితం ఈప్రాంతంలోనే ఏనుగుల మంద సంచరించాయి. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడండి

● అధికారులకు జడ్పీ చైర్మన్ సూచన



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 1: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఇప్పట్నుంచే తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం జడ్పీ చైర్మన్ ఛాంబర్‌లో 2, 3, 4, 5, 6 స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. ముందస్తుగా అన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని, మంచినీటి పైపులను మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని సూచించారు. రబీ సీజన్‌లో పంటల సాగు విస్తరణ మరింత ఎక్కువ చేయాలన్నారు. పట్టుపరిశ్రమ అభివృద్ధికి మరిన్ని ప్రోత్సాహకాలు అందివ్వాలని సూచించారు. మామిడి పంటకు వచ్చే వ్యాధుల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టేందుకు పలు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశాల్లో జడ్పీ వైస్‌చైర్మన్ రమ్య, సీఈవో ప్రభాకర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, జడ్పీటీసీలు పాల్గొన్నారు. కాగా ముఖ్యమైన స్థాయిసంఘ సమావేశాలకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు మంత్రులెవ్వరూ హాజరుకాలేదు.





బహిరంగసభకోసం ఎంపిక భూమిపూజ చేస్తున్న నేతలు - వేదిక, సభా స్థలి ఏర్పాటుకు వచ్చిన సామగ్రి

రామానాయుడుపల్లె వద్దే చంద్రబాబు సభ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 1: మాజీ సీఎం చంద్రబాబు 'రా..కదలిరా' బహిరంగ సభకు గంగాధర నెల్లూరు పంచాయతీ రామానాయుడుపల్లె వద్ద స్థలాన్ని ఎంపిక చేశారు. రామానాయుడుపల్లె (చిత్తూరు - పుత్తూరు ప్రధాన రోడ్డుపక్కన) బస్టాప్ వద్ద ఈ స్థలంలో సభా వేదిక ఏర్పాట్లకు గురువారం భూమిపూజ చేశారు. ఈ స్థలంలో మంగళవారం చంద్రబాబు సభ జరగనుంది. ఈ సభా స్థలాన్ని మాజీ మంత్రి అమరనాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తినాని, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి థామస్, నియోజకవర్గ పరిశీలకుడు రవిప్రకాష్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో నగరి, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జిలు గాలి భానుప్రకాష్, మురళిమోహన్, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబు రెడ్డి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజుపురం, కార్వేటినగరం మండలాల టీడీపీ అధ్యక్షులు స్వామిదాస్, జయశంకర్‌నాయుడు, చెంగల్రాయయాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు. కాగా, భూమి పూజ చేసిన వెంటనే ఎక్స్‌కవేటర్‌తో ముళ్లకంపలు, పిచ్చిమొక్కలను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. మరో వైపు వేదిక, సభా ప్రాంగణం కోసం అవసరమైన మెటీరియల్‌తో లారీలు గురువారం సాయంత్రానికి చేరుకున్నాయి.

వీర్నమలలో రంకెలేసిన కోడెగిత్తలు





బరిలో పరిగెత్తించేందుకు ఎద్దులను సిద్ధం చేస్తున్న రైతులు - బరిలో పరుగు తీస్తున్న ఎద్దులు

రామకుప్పం, ఫిబ్రవరి 1: రామకుప్పం మండలం వీర్నమల గ్రామంలో గురువారం జల్లికట్టు నిర్వహించారు. జల్లికట్టును చూసేందుకు వచ్చిన వేలాదిమంది జనంతో వీర్నమల వీధులు జనసంద్రంగా మారాయి. జల్లికట్టు పరుగుపందెంలో మెరుపువేగంతో పరుగులు తీసే ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30వేలు,మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.15వేలు, ఐదో బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతిగా రూ.7వేలుతో బాటు మరో 44 నగదు బహుమతులు, మరో 23బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పదిహేను రోజులుగా ప్రచారం చేశారు. దీంతో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి వందలాది మంది రైతులు తమ ఎద్దులను తెల్లారి జామునే వీర్నమలకు తీసుకొచ్చారు. ఉదయం గంగమ్మ ఆలయంలో రైతులు పూజలు చేశారు. అనంతరం డప్పుల హోరు మధ్య తమ ఎద్దులను బరిలో పరుగులు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీలు పడ్డారు. సాయంత్రం అతి తక్కువ సమయంలో ఎద్దుల యజమానులకు నిర్వాహకుల బహుమతులు అందజేశారు. జల్లికట్టులో ఒకరిద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సందర్భంగా తమిళనాడు నుంచి వచ్చిన రైతులు పలు ఎద్దులను రూ.1లక్ష నుంచి రూ.15లక్షల వరకు కొనుగోలు చేసినట్టు స్థానికులు తెలిపారు.





పరుగు పెడుతున్న కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు - జనసంద్రంగా మారిన కెనమాకులపల్లె

కెనమాకులపల్లెలో ఎద్దుల పండుగ

శాంతిపురం : శాంతిపురం మండలం కెనమాకులపల్లెలో నిర్వహించిన ఎద్దుల పండుగ గురువారం కోలాహలంగా జరిగింది. పశువులకు రంగురంగుల కాగితాలతో అలంకరించి సంప్రదాయ బద్ధంగా తోరణాలు కట్టి గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధిలో పశువులకు టవళ్లు కట్టి పరుగులు పెట్టించారు. వాటిని నిలువరించేందుకు యువకులు ఎగబడ్డారు. ఈ క్రమంలో పలువురు గాయపడ్డారు. ఈ వేడుకను తిలకించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో కెనమాకులపల్లె జనసంద్రాంగా మారింది.

అల్లిలో కోడెగిత్తను వదిలి పెడుతున్న దృశ్యం




ఘనంగా మైలేరు పండుగ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలం జంగాలఅగ్రహారం వద్ద గురువారం మైలేరు పండుగ కోలాహలంగా నిర్వహించారు. కోడెగిత్తలకు నిర్వాహకులు భారీనగదు బహుమతులు ప్రకటించడంతో వివిధప్రాంతాల నుంచి పలువురు తమ పశువులను తీసు కొచ్చారు. కోడెగిత్తలను నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. మైలేరు పండు గను తిలకించడానికి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు.

చనిపోయినా ఓట్లు పదిలం

తమిళంలో ఓటర్ల పేర్లు


UUA3817655
UUA3817030
1155 | 2 | TAU2517678
1156 | 7 | UVQ1235308

కేజీకండ్రిగలో మృతిచెందిన వారికీ ఓట్లు | ఓటర్ల జాబితాలో తమిళంలో పేర్లు

నగరి, ఫిబ్రవరి 1: చనిపోయినా ఓట్లు మాత్రం పదిలం. ఇది నగరి మండల పరిధిలోని 165వ పోలింగు బూత్‌లో పరిస్థితి. కేజీకండ్రిగలో 19 మంది చనిపోయిన వారికి అలాగే ఓటర్ల జాబితాలో ఓట్లు ఉన్నాయి. పకడ్బందీగా జాబితా తయారీ చేశామని చెప్పే అధికారులు దీనికి ఏం సమాధానం చెబుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక, నగరి పట్టణ పరిధిలోని 140వ పోలింగు బూత్‌లో 1055, 1056 సంఖ్య గల ఓటర్ల పేర్లు తమిళంలో ముద్రించి ఉన్నారు. అలాగే బూత్ నెంబరు 143లోనూ కొందరు ఓటర్ల పేరు తమిళంలో ఉన్నాయి.

అమీర్ జాన్‌పై దాడి, అరెస్టు దారుణం

పలమనేరు, ఫిబ్రవరి 1: బైరెడ్డిపల్లె మండలం దేవదొడ్డి గ్రామానికి చెందిన మహిళా సర్పంచ్ భర్త అమీర్‌జాన్ పై వైసీపీ నాయకులు అమానుషంగా దాడిచేయడంతో పాటు పోలీసులు సైతం ఏక పక్షంగా వ్యవహరించి బాధితుడు అమీర్‌జాన్‌ను అరెస్టుచేయడం దారుణమని మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. గురువారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వీరు మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి అధికారం ఉంది కదాఅని దేవదొడ్డి ఎంపీటీసీ అహంతో అమీర్‌జాన్ కు చెందిన స్థలంలో దౌర్జన్యంగా అక్రమ నిర్మాణాన్ని చేపట్టడంతో ప్రశ్నించిన నేరానికి దౌర్జన్యానికి పాల్పడటం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు వైసీపీ గూండాలకు కొమ్ము కాయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ ఖాజా పీర్, మైనారిటి నాయకులు చాంద్‌బాషా, ముబారక్, రహీం, హనీఫ్, మాభాషా, అఫ్రోజ్, బాబాజాన్, అమానుల్లా, షరీఫ్, మౌలా, నదీమ్, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.



మైనారిటీ నేతలతో కలిసి మాట్లాడుతున్న ఖాజాపీర్

సత్యవేడుకు స్థానికులు పనికిరారా?


● వైసీపీలో పెరుగుతున్న అసంతృప్తి

● టికెట్ స్థానికులకే ఇవ్వాలని డిమాండ్

సత్యవేడు, ఫిబ్రవరి 1: సత్యవేడు వైసీపీలో స్థానికేతర అంశం తెరమీదకొచ్చింది. ముక్కూ మొహం తెలియని వాళ్లకు టికెట్ ఇస్తే పనిచేసేది లేదని ఆ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా తమ వాదనలు వినిపిస్తున్నారు. స్థానికులకే అభ్యర్థిత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్తను రోజుల వ్యవధిలోనే పార్టీ అధిష్ఠానం మారుస్తూ వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం వైసీపీ విడుదల చేసిన ఐదవ జాబితాలో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగాధర నెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్ పేరు ప్రకటించారు. దీనిపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ పెద్దల నిర్ణయంపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఇరవై రోజుల వ్యవధిలో రెండుసార్లు అభ్యర్థులను మార్చడం, కనీసం తమ అభిప్రాయాలనైనా తీసుకోకుండా అభ్యర్థిని నియమించడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో అధిష్ఠానాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలాన్ని ప్రకటిస్తే గెలిపించాం. ఇప్పుడు ఆయనకాదు గురుమూర్తి అంటే ఒప్పుకున్నాం. అందరికంటే ముందు ఆయనను ప్రసన్నం చేసుకోవాలన్న ఆరాటంతో ఆయనను కలిసి సన్మానించాం. తీరా ఆయన కూడా కాదు ఇంకొకరిని తీసుకొచ్చి ఇతనే మీ అభ్యర్థి అంటే మీకంటికి మేం ఎలా కనిపిస్తున్నామంటూ ఓ రేంజ్‌లో ఫైర్ అవుతున్నారు. దీంతో కొత్త అభ్యర్థిని ప్రకటించినా ఎక్కడా సందడి వాతావరణం లేకుండా నిశ్శబ్దం అలుముకుని, కేడర్ నైరాశ్యంలోకి వెళ్ళిపోయింది. అభ్యర్థి మార్పుతో కీలక పెద్దనేత తీరుపై నిరసన స్వరం సర్వత్రా వ్యక్తమవుతోంది.పెద్దిరెడ్డిని ధిక్కరించిన ఆదిమూలం దిష్టిబొమ్మలు కాల్చి, తమ అభ్యర్థి గురుమూర్తేనని, అప్పుడే గెలిచి పోయినట్లు రెండు రోజులుగా నేతలు సంబరాలు కూడా చేసుకున్నారు. బుధవారం రాత్రి వరకు ధీమాగా ఉన్న వైసీపీ నాయకులు కొత్త అభ్యర్థి ప్రకటనతో దీనంగా మౌనందాల్చారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ ఒక్కసారిగా డీలా పడిపోయింది. ఆదిమూలం దెబ్బతో నియోజకవర్గంలో మలుపులు తిరుగుతున్న రాజకీయం సర్వత్రా ఆసక్తికరంగా ఉంది.

దళిత వర్గాల్లో పెరుగుతున్న సానుభూతి

పెద్దిరెడ్డిని విభేదించి పార్టీని వీడిన ఆదిమూలంపై వైసీపీలోని ప్రధాన సామాజిక వర్గం చేసిన అమానుష వైఖరి పట్ల దళితవర్గాల్లో ఆయనకు సానుభూతి పెరుగుతోంది. పెద్దిరెడ్డిపై ఆదిమూలం చేసిన విమర్శలను జీర్ణించుకోలేని ప్రధాన సామాజిక వర్గ నేతలు ఆయన దిష్టిబొమ్మలను కాల్చ డం, పార్టీకి పట్టిన శని పోయిందని వ్యాఖ్యలు చేయడం పట్ల దళిత సామాజికవర్గంలో ఆదిమూలంపై అమాంతం సానుభూతి పెరిగింది. ఈ పరిణామాలతో ఎమ్మెల్యే వర్గీయులతో పాటు పలువురు పార్టీ నేతలు కూడా ఆదిమూలంతో టచ్‌లోకి వెళ్ళిపోయినట్లు సమాచారం.ఎమ్మెల్యే సైతం గుట్టుచప్పుడు కాకుండా తన సామాజిక వర్గం మద్దతు కూడగట్టుకుంటున్నట్లు సమాచారం. ఇదే జరిగితే నియోజకవర్గంలో సగం వైసీపీ ఖాళీ అవుతుందని చర్చించుకుంటున్నారు.



తిరుమలలో రేపటి నుంచి ధార్మిక సదస్సు

తిరుమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం నుంచి సనాతన ధార్మిక సదస్సు ప్రారంభం కానుంది. హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ నిమిత్తం టీటీడీ ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు తిరుమలలోని ఆస్థానమండపంలో సనాతన ధార్మిక సదస్సు నిర్వహించబోతోంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 57 మంది పీఠాధి, మఠాధిపతులను, ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులను టీటీడీ ఇప్పటికే ఆహ్వానించింది. హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ, సనాతన హిందూ ధర్మవిలువల వ్యాప్తి పరచడంతో పాటు విశిష్టతను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలు, సలహాలపై సదస్సులో చర్చించనున్నారు. పీఠాధి, మఠాధిపతులకు తగిన ఏర్పాట్లు చేసేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఒకో స్వామిజీకి ఒక లైజన్ అధికారిని నియమించారు. దర్శనం, వసతి, ఆహారం, రవాణా వంటి కమిటీలతో లైజన్ అధికారి సమన్వయం చేసుకుని స్వామిజీలకు తగిన ఏర్పాట్లు చేస్తారు.

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో జిల్లా ప్రాజెక్టులకు గుర్తింపు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 1: సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో జిల్లాకు చెందిన మూడు ప్రాజెక్టులకు గుర్తింపు లభించింది. టీచర్ల విభాగంలో మై క్యారియర్ బ్యాడ్ ఫర్ బ్యాడ్ హిడన్ పేషంట్స్.. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో ఉమన్ సేఫ్టీ డివైజ్ విత్ జీపీఎస్ లోకేషన్.. విద్యార్థుల గ్రూపు విభాగంలో ఇరిగేటెడ్ ఫార్మింగ్ ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో విజయేంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి రమణ తెలిపారు. ఈ విద్యార్థులతో పాటు టీచర్లకు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. గత నెల 27 నుంచి విజయవాడలో నిర్వహించిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ గురువారంతో ముగిసింది.



విద్యార్థినులు, గైడ్ టీచర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 1: చిత్తూరులోని సీటమ్స్‌లో ఈనెల 24న మొదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకు గాను 248 మంది హాజరు కాగా, ఎనిమిది మంది గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం పరీక్షకు 128 మందికి గాను 124 మంది.. మధ్యాహ్నం 128 మందికి గాను 124 మంది హాజరయ్యారన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

హంద్రీ - నీవాను అడ్డుకుంది వైసీపీ నేతలే

● 10 శాతం పనులు పూర్తిచేయలేక నేడు డ్రామాలు
● టీడీపీ విమర్శ



మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 1: చంద్రబాబు హయాంలో ప్రారంభమైన హంద్రీ -నీవా కుప్పం బ్రాంచి కాలువ పనులు పూర్తికాకుండా అడ్డుకుంది వైసీపీ నేతలేనని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు విమర్శించారు. అయినా 90 శాతం పనులు చంద్రబాబు పూర్తిచేశారని చెప్పారు. మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా కుప్పానికి హంద్రీ -నీవా ద్వారా కృష్ణా జలాలను తెచ్చేస్తున్నట్లు ఇప్పుడు అధికార పార్టీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని ఆక్షేపించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హంద్రీ -నీవా కుప్పం బ్రాంచి కెనాల్ నిర్మాణం కోసం సర్వే చేయించారని గుర్తుచేశారు. ఆ తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 2014లో హంద్రీ -నీవా కుప్పం బ్రాంచి కెనాల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.468 కోట్లు మంజూరు చేశారన్నారు. అప్పటినుంచి 2019లో అధికారం నుంచి దిగిపోయేదాకా ఆయన కాలువ నిర్మాణానికి అకుంఠిత దీక్షతో పనులు జరిపించారని చెప్పారు. అప్పటి వైసీపీ కుప్పం నియోకవర్గ కన్వీనర్ చంద్రమౌళి రైతులను రెచ్చగొట్టి కోర్టుల్లో కేసులు వేయించి అక్కడక్కడా భూములనివ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అయినా సరే చంద్రబాబు పట్టువదలని విక్రమార్కుడిలా 90 శాతం పనులు పూర్తిచేసి ఎన్నికలకు ముందు వి.కోట దాకా హంద్రీ-నీవాలో కృష్ణా జలాలను తీసుకొచ్చి వదిలారని గుర్తుచేశారు. 2022లో సీఎం జగన్ కుప్పం పర్యటన సమయంలో ఆరు నెలల్లో హంద్రీ -నీవా కాలువను పూర్తి చేసి కుప్పం ప్రజలకు సాగు, తాగునీటి కొరతను తీరుస్తానని ఇచ్చిన హామీని విస్మరించారని తెలిపారు. ఇప్పుడు ఎన్నికల కోసం అరకొరగా నాసిరకంగా పనులు చేసి రామకుప్పం దాకా నీటిని తీసుకొస్తామని వైసీపీ నాయకులు ఊదరగొట్టడం ప్రజలను మభ్య పెట్టడానికేనని ఆక్షేపించారు. వాస్తవాలు ఇలా ఉండగా సీఎం జగన్ రామకుప్పంలో హంద్రీ -నీవా కాలువను ప్రారంభిస్తారని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నిజంగా పనులు పూర్తయి ఉంటే హంద్రీ -నీవా కాలువ అఖరి పాయింట్ అయిన కుప్పం మండలం పరమసముద్రం చెరువు దాకా నీటిని తీసుకొచ్చి వదలాలని సవాల్ విసిరారు. ఈ సమావేశం తర్వాత టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, మణి, శాంతారాం తదితరులు పరమసముద్రం చెరువు వద్దకు వెళ్లి అక్కడ ఖాళీగా ఉన్న హంద్రీ -నీవా కాలువను పరిశీలించారు. చేతనైతే ఇక్కడిదాకా నీళ్ల తెచ్చి చూపించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కాణిపాకం వెంకటేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ గ్రామవికాస సమావేశాలు

రామకుప్పం, ఫిబ్రవరి 1: రామకుప్పం మండలంలో శుక్రవారం నుంచి వారం రోజులపాటూ గ్రామవికాస సమావేశాలు నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. ఈ నెల 2న పీఎంకేతాండా, పంద్యాలమడుగు, 3న 89పెద్దూరు, ననియాలతాండా, నారాయణపురంతాండా, ముద్దనపల్లె, 4న వీర్నమల, మూడు గిరిజన తాండా పంచాయతీలు, 5న బల్ల, ఉస్సిగానిపల్లె, విజలాపురం, 6న సింగసముద్రం, కెంచనబల్ల, మణీంద్రం, 7న కొంగనపల్లె, చెల్దిగానిపల్లె, బైపరెడ్డపల్లె, 8న రాజుపేట, బందార్లపల్లె, గొరివిమాకులపల్లె, 9న రామకుప్పంలలో ఈ సమావేశాలు జరుగుతాయని వారు తెలిపారు. ఈ సమావేశాల్లో గ్రామాల్లోని అన్నివర్గాల అభ్యున్నతికి చేపట్టాల్సిన అభివృద్ధి సంక్షేమ పథకాల రూపకల్పన, పార్టీ పటిష్టతపై చర్చలు ఉంటాయని వివరించారు. ఈ సమావేశాలకు ఆయా పంచాయతీలలోని పార్టీ నేతలు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని వానే కోరారు.

పీఈఎస్‌లో రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు ప్రారంభం



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న ప్రముఖులు

కుప్పం, ఫిబ్రవరి 1: కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలో రీసెర్చ్ మెథడాలజీపై మూడు రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును డీన్ అండ్ ప్రిన్సిపాల్ క్రిష్ణారావు, మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. అత్యాధునిక పరిశోధనా పద్ధతులను పెంపొందించుకునేందుకు ఈ వర్క్‌షాపు దోహదపడుతుందని వారు ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా వివిధ పరిశోధనా పద్ధతులు, గణాంక విశ్లేషణ, నైతిక పరిగణనలపై విస్తృత చర్చలు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ చిత్రనాగరాజు, ఐఆర్‌సీ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించండి

పలమనేరు, ఫిబ్రవరి1 : వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని వాహన తనిఖీ అధికారులు కోరారు. జాతీయ రహదారిపై పట్టణ సమీపంలోని కేటిల్‌ఫారం చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీ అధికారులు వాహన దారులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాక్టర్లు, చిన్నచిన్న వాహనదారులను, లారీలను నిలిపి డ్రైవర్లకు రహదారి నిబంధనలు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. 35వ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు ఆంజనేయ ప్రసాద్, ఎంజేపీ భూషణ్ రెడ్డి, సహాయ వాహన తనిఖీ అధికారి హరికిషోర్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనతో భవిష్యత్తుపై అవగాహన



టీఎస్ అగ్రహారం సచివాలయంలో విద్యార్థులు

పలమనేరు, ఫిబ్రవరి1: భవిష్యత్తుపై ఓ అవగాహనకు క్షేత్ర స్థాయి పర్యటనలు దోహదపడుతాయని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం షంషేర్ తెలియజేశారు. పాఠశాలలో వృత్తి విద్యాకోర్సు చదువుతున్న విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలోని వివిధ శాఖల గురించి, ఆయా శాఖలు నిర్వర్తించే విధులు, ప్రభుత్వ పథకాల అమలు గురించి ఆయా శాఖల సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్నాటి సురేష్, శివశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, సురేష్, 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా రెండేళ్లుగా ఇక్కడి పాఠశాలలో అగ్రికల్చర్, కంప్యూటర్ వృత్తివిద్యా కోర్సులను ఇండస్ ఎడ్యు ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ప్రభుత్వం నిర్వహిస్తోంది.

కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించండి



రామకుప్పం, ఫిబ్రవరి 1: కుప్పంలో గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆ కులానికి సంబంధించిన పలువురు నేతలు కలెక్టర్ షన్మోహన్‌ను కోరారు. ఈ మేరకు గురువారం రామకుప్పం వచ్చిన కలెక్టరు షన్మోహన్‌కు రెస్కో చైర్మన్ సెంధిల్‌కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. స్థలం కేటాయించడానికి కలెక్టర్ సానుకూలం వ్యక్తం చేశారని గాండ్ల కులస్తులు తెలియజేశారు.

టీడీపీ క్యాలెండర్ ఆవిష్కరణ



శాంతిపురం, ఫిబ్రవరి 1: తెలుగుదేశం పార్టీ ముద్రించిన 2024 క్యాలెండర్‌ను ఆ పార్టీ మండల అధ్యక్షులు భాష్యం విశ్వనాథనాయుడు నేతృత్వంలో అబకలదొడ్డిలో గురువారం ఆవిష్కరించారు. పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షులు విజయరామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ ఆంజనేయరెడ్డి, నేతలు నాగరాజు, వెంకటేష్, చెంగప్ప తదితరులు పాల్గొన్నారు.

23లోగా గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 1: గంగాధరనెల్లూరు (బంగారెడ్డిపల్లె)కు సమీపంలో గల బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 23వ తేదీలోపు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దమయంతి కోరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు అయితే 1.9.2011 నుంచి 31.8.2015 మధ్య పుట్టినవారై ఉండాలని, ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్‌లు అయితే 1.9.2013 నుంచి 31.8.2015 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. అదేవిధంగా 2022-23 విద్యా సంవత్సరంలో 3వతరగతి, 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి నిరవధికంగా ప్రభుత్వ లేదంటే ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువు పూర్తి చేసి ఉండాలని చెప్పారు. వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1: ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ గురువారం వెదురుకుప్పంలో ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రత్యేక హోదా విషయమై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలను అమలు చేయాలని, పోలవరాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్న డిమాండ్‌తో నిరసన ఉంటుందన్నారు.

నేడు చిన్నబెస్తపల్లిలో జయహో బీసీ సభ

కల్లూరు, ఫిబ్రవరి1: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ చిన్న బెస్తపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ జయహో బీసీ సభ నిర్వ హిస్తున్నట్లు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

నేడు, రేపు మదర్‌థెరిస్సాలో ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

గంగవరం, ఫిబ్రవరి 1: ఈ నెల 2, 3 తేదీల్లో స్థానిక మదర్‌థెరిస్సా కళాశాలలో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్-2024 జరగనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ను మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, కుప్పం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, బెంగళూరుకు చెందిన సైనోప్‌సిస్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉమ్మడిగా నిర్వహిస్తున్నాయని వివరించారు. పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులతో పాటు, ఇంజనీరింగ్ విద్యార్థుల సహకారంతో హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఈ ప్రదర్శనలో ప్రదర్శిస్తారని తెలియజేశారు. ఈ ప్రాజెక్టులో ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులు ఈ నెల 5వ తేదీ హైదరాబాదులో జరగబోయే జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కు హాజరవుతారని వెల్లడించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను పలమనేరు పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ



సదుం, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని బడుగు, బలహీనవర్గాలకు చెందిన 22 మంది డప్పు కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను గురువారం అందజేశారు. గుర్తింపు కార్డుల ద్వారా సామాజిక భద్రతా పింఛన్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల లబ్ధికి వారు అర్హులవుతారని ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో సుమారు 150 మంది డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో వరప్రసాద్, వైసీపీ యూత్ ప్రెసిడెంట్ రెడ్డెప్పరెడ్డి, దళిత సంఘం నాయకులు సీతాపతి, శ్రీనివాసులు, రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మేదరి మునుస్వామికి సన్మానం



పలమనేరు, ఫిబ్రవరి1 : పలమనేరుకు చెందిన మేదరి ఊతుకోట మునస్వామిని గురువారం మేదర సాధికారిక రాష్ట్రకన్వీనర్ యేసుబాబు, జిల్లా మహిళా మేదరసంఘ కార్యదర్శి మల్లిక శాలువకప్పి ఘనంగా సన్మానించారు. దశాబ్దాలుగా మేదరి కులవృత్తితో జీవనం సాగిస్తున్న ఊతుకోట మునస్వామి వృత్తి కళాకారులకు మార్గదర్శిగా ఉన్నారని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మేదరసంఘ నాయకులు వెంకటరమణ, యోగా గురువు నందగోపాల్, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు, పలువురు మేదర్లు పాల్గొన్నారు.

నగరి డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

నగరి, ఫిబ్రవరి 1: నగరి పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా వచ్చినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. 2023లో నాక్ పర్యవేక్షణలో 3.28 సీజీపీఏతో ఆంధ్రప్రదేశ్‌లో ఏ+ సాధించిన రెండవ కళాశాలగా నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచిందన్నారు. ఈ గుర్తింపు దృష్ట్యా ఏపీ ఉన్నత కళాశాల విద్యా కమిషనర్ ఆదేశనుసారం దరఖాస్తు చేయడంతో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ 2024 జనవరి 31 వ తేదీన అటానమస్ కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కోర్సులు, సిలబస్, పరీక్షలు కళాశాల నియంత్రణలో ఉంటాయన్నారు.

ఎంఈవోలు పాఠశాలలను తనిఖీ చేయాలి: డీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 1: వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతున్న క్రమంలో ఎంఈవోలు మీ మండలాల్లోని ప్రతి పాఠశాలను తప్పని సరిగా తనిఖీ చేయాలని డీఈవో విజయేంద్రరావు సూచించారు. గురువారం స్థానిక బాలాజీ కాలనీలోని సమావేశ మందిరంలో ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తనిఖీ వివరాలను ఎంఈవోలు డీఈవో కార్యాలయానికి పంపాలని చెప్పారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. సమావేశంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ జయప్రకాష్, సెక్టోరియల్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్నాక్యాంటీన్‌లో గాండ్లపల్లికి చెందిన బాలాజీ నాయుడు గురువారం భోజనం వితరణ చేశారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కాంతారావు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి : జేసీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

కల్లూరు, ఫిబ్రవరి1: రేషన్ బియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. పులిచెర్ల మండలం కల్లూరులో గురువారం సాయంత్రం ఎండీయూ వాహనం ద్వారా చేపట్టిన రేషన్ పంపిణీని ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు పంపిణీ చేస్తున్నారా లేదా అని ఎండీయూ వాహనం ఆపరేటర్ సహదేవను జేసీ ప్రశ్నించారు. లబ్ధిదారుల ఇంటి వద్దకెళ్లి పంపిణీ చేస్తున్నామని సమాధానం ఇచ్చారు. బియ్యం విక్రయించరాదని లబ్ధిదారులకు సూచించారు. అంతకుముందు పులిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో శంకరన్, ఎంపీపీ సురేంద్ర నాథరెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు, డీటీ త్యాగరాజు, ఆర్ఐ దొరస్వామి, వీఆర్‌వో శకుంతల, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



టీడీపీలో చేరిన పెద్దగొట్టిగల్లు వాసులు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 1: మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీ పరిధిలోని పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గురువారం పుంగనూరు నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రా రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేకల జయరామిరెడ్డి, వి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.సుధాకర్, చిట్టేని ఎర్రయ్య, ఎస్.శ్రీనివాసులు, గోపీనాథరెడ్డితో పాటు వారి కుటుంబసభ్యులు పార్టీ తీర్థం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ రైతు అధ్యక్షుడు ఓబులేశ్వర రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, సిద్ధయ్య, మాజీ సర్పంచ్ రవినాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రామకుప్పం కార్యవర్గం ఏర్పాటు



నాగరాజు, బాలాజీ, చిట్టిబాబు, హరినాథాచారి

రామకుప్పం, ఫిబ్రవరి 1: ఎస్టీయూ రామకుప్పం మండల కొత్త కార్యవర్గం ఎన్నికల జిల్లా అధ్యక్షుడు దేవరాజుల రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. మండల అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధానకార్యదర్శిగా బాలాజీ, గౌరవాధ్యక్షుడిగా చిట్టిబాబు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అమరశేఖర్‌రెడ్డి, హరినాథాచారి, మోహన్, నారాయణ ఎన్నికయ్యారు.

పాఠశాలలో విద్యార్థులతో పనులు

● ఎంఈవోకు తల్లిదండ్రుల ఫిర్యాదు





పాఠశాలలో వస్తువులు మోస్తున్న విద్యార్థులు

పాలసముద్రం, ఫిబ్రవరి 1: మండలంలోని తిరుమలరాజుపురం ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పాఠశాల గోడలకు రంగులు వేసే పనులను కాంట్రాక్టర్ చేయిస్తున్నారు. పాఠశాలలో ఉన్న డెస్కులు, ఇతర వస్తువులను విద్యార్థులతో మోయించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులు విద్యాబోధన చేయకుండా విద్యార్థులతో పాఠశాలలోని డెస్కులు మోయించి రంగులు వేస్తుండటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

ఈవోను విచారించిన అసిస్టెంట్ కమిషనర్



ఈవోను విచారిస్తున్న ఏసీ ఏకాంబరం తదితరులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 1: స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయ ఈవో తిమ్మారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై గురువారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనరు ఏకాంబరం విచారణ నిర్వహించారు. ఆలయంలో పని చేస్తున్న గీత అనే మహిళకు నెలవారి వేతనం సరిగ్గా ఇవ్వకుండా, జనవరి ఒకటి నుంచి విధుల్లోకి అనుమతించలేదని ఆమె దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు గురుప్రసాద్‌కు ఇటీవల లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు డీసీ ఈవోను విచారించి నివేదిక పంపాలని ఏసీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఫిర్యాదుదారు గీత, ఈవో తిమ్మారెడ్డిలను విచారించి ఇరువురి అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా నమోదు చేశారు. ఆలయ చైర్మన్ ఎత్తిరాజులు, అర్చకులు సుధాకర్ గురుకుల్, ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, కార్యాలయ సిబ్బంది రాధిక, గాయత్రి పాల్గొన్నారు.

నేడు కోదండరాముల కల్యాణం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 1: స్థానిక కోదండ రామాలయంలో భాద్రపద మాసం రెండోవారం (తై మాసం) సందర్భంగా సీతారాములకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు స్వామి అమ్మవార్ల తలంబ్రాలు, అక్షింతలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పోలీసుల హెచ్చరిక డిజిటల్ బోర్డు ఏర్పాటు

పలమనేరు, ఫిబ్రవరి1 : పలమనేరులో దొంగలు, మోసగాళ్ల గురించి ప్రజలను హెచ్చరించే డిజిటల్ బోర్డును సీఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో దాత సహకారంతో హెచ్చరికల బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇలాంటి డిజిటల్ బోర్డులను ఇప్పటికే టవర్‌క్లాక్ సమీపంలో, అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం సంత జరిగే ప్రాంతానికి చేరువలో ఈ డిజిటల్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామని తెలి పారు. ఈ కార్యక్రమంలో దాత ఆర్ఎంపీ డాక్టర్ డిల్‌షాద్, ఇమ్రాన్, ఎండీఏస్, ఎస్ఐ, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ బోర్డు (ఇన్‌సెట్లో) రిబ్బన్ కట్ చేసి బోర్డును ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్

సైనికుల్లా పనిచేద్దాం సైకిల్‌కు ఓటేయిద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, ఫిబ్రవరి1: 'సైనికుల్లా పనిచేద్దాం.. సైకిల్‌కు ఓటేయిద్దాం' అని టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలం లోని లద్దిగంలో పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లాలని సూచిం చారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బోయకొండ సుబ్రహ్మణ్యం, గిరిరాజు, నాగరాజరెడ్డి, రాధాకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

భూరక్షణ చట్టాన్ని రద్దు చేయాలి



రిలే దీక్షలు చేస్తున్న న్యాయవాదులు


పుంగనూరు రూరల్, ఫిబ్రవరి1: భూరక్షణ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కోర్టు సమీపంలోని మినీబైపాస్‌పై చేపట్టిన రిలే దీక్షలు మూడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాల వల్ల సామాన్యులు భూములు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ నాయకులకు, కార్పొరేట్లకు లబ్ధిచేకూరే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణారెడ్డి, రవీంద్ర, సీవీ.రమేశ్ బాబు, కల్పన, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి1: పేదలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గురువారం పట్టణ సమీపంలోని సింగిరిగుంట సమీపంలోని కంపోస్టు యార్డులో నివసిస్తున్న పేదలకు, భిక్షగాళ్లకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్లిరోజు, పుట్టిన రోజున అనవసరంగా ఖర్చు చేయడం కన్నా పేదలకు అన్నదానం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు తమ సంస్థ చేస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సురేశ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట నరసింహులు

సోమల, ఫిబ్రవరి 1: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సోమల ఎస్ఐ వెంకట నరసింహులు పేర్కొన్నారు. గురువారం నంజంపేట బస్టాండ్‌లో స్థానికులతో ఆయన మాట్లాడారు. వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమ న్నారు. పొలాల వద్ద పంటల రక్షణ కోసం విద్యుత్ తీగలు తీయరాదని సూచించారు. యువత ఆన్‌లైన్ గేమ్‌ల మాయలో పడి నగదు పోగొట్టుకుంటున్నారని తెలియజేశారు. తల్లిదండ్రులు పిల్లలను సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని తెలిపారు. అలాగే మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదని, బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పది, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో పిల్లల పట్ల శ్రద్ధచూపాలని సూచించారు.

వీ.కోట తహసీల్దార్‌గా సురేష్‌కుమార్

వి.కోట, ఫిబ్రవరి 1: వి.కోట తహసీల్దార్‌గా సురేష్ కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ చిట్టిబాబు అనంతపురం జిల్లాకు బదిలీకాగా ఆయన స్థానంలో కడప జిల్లా నుంచి సురేష్‌కుమార్ వి.కోటకు రానున్నారు. కాగా వైసీపీ అధికారంలోకి వచ్చాక గడిచిన నాలుగున్నరేళ్లలో వి.కోటకు పది మంది తహసీల్దార్లు బదిలీ కావడం గమనార్హం.

టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 1: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ పేర్కొన్నారు. గురువారం మండల టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన గంగాధరనెల్లూరు మండలంలో జరగబోయే రా.. కదలిరా కార్యక్రమానికి హాజరవుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా కృషిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం పరిశీలకులు రవిప్రకాష్, సమావేశం పరిశీలకులు నిమ్మల కిష్టప్ప, నేతలు గంధమనేని జయశంకర్ నాయుడు, చిట్టిబాబు నాయుడు, రుద్రప్ప నాయుడు, శ్రీధర్ యాదవ్, ఎన్. కుమార్, కిషన్‌చంద్, జనార్ధన్‌రాజు, కార్జాల అరుణ, ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న మురళీమోహన్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 1: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని మంగళపల్లి పంచాయతీలోని పావనివాండ్లపూరు, 65 వెంకటాపురం, జిల్లేడుపల్లి, జె. కొత్తూరు గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుప్పాల మురళి, జయచంద్ర నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు కోడిచంద్రయ్య, నాయకులు మహేంద్ర, గుర్రప్ప, భరత్, జనార్దన్ గౌడ్, రమేష్, హరిప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాలక్రిష్ణాపురంలో కరపత్రాల పంపిణీ

పాలసముద్రం, ఫిబ్రవరి 1: మండలంలోని బాలక్రిష్టాపురం, బాలక్రిష్టాపురం కాలనీ, ఆముదాలపుత్తూరు గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీచేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందించే సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీలు, బస్సు ఛార్జీల పెంపుతో పాటు ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు కేశవులు నాయుడు, జె. విజయ్‌కుమార్, అరుణ్‌నాథన్, మగిదాస్, సెల్వం, వెంకటేశులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బారిన పడ్డ విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు, ఫిబ్రవరి 1: క్యాన్సర్ బారిన పడి వైద్యం చేయించుకునే స్థోమత లేని ఓ చిన్నారికి ఉపాధ్యాయులు మేమున్నామంటూ గురువారం కొంత ఆర్థికసాయం చేశారు. మండలంలోని తోటవారిపల్లె గ్రామానికి చెందిన గణపతి, భారతి దంపతుల కుమార్తె తేజశ్రీ ఎర్రచెరువుపల్లి ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. తేజశ్రీ గత కొన్ని రోజులుగా అనారోగ్యం బారిన పడటంతో తల్లిదండ్రులు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించగా, బోన్ క్యాన్సర్ జబ్బు సోకిందని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించే స్థోమత లేకపోవడం వల్ల ఆ చిన్నారి ఇంటి వద్దే ఉంటోంది. దీంతో విషయం తెలుసుకున్న ఎర్రచెరువుపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తమవంతుగా రూ.25,500 నగదును చిన్నారి స్వగ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు అందించారు.

అన్నాక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం



పూతలపట్టులో టీడీపీ నేతల అన్నదానం

పూతలపట్టు, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్నాక్యాంటీన్‌లో గాండ్లపల్లికి చెందిన బాలాజీ నాయుడు గురువారం భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కాంతారావు, నాయకులు చంద్రమౌళి, చంద్రశేఖర్ నాయుడు, జయబాబు, యువరాజు, రజనీ, హరి, ఊట్ల నాగరాజులు నాయుడు, హేమాద్రి నాయుడు, వీరభద్రయ్య, ఏకాంబరం, విజయ్, సుధ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో....



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నాక్యాంటీన్‌లో గురువారం నలగాంపల్లికి చెందిన లగడపాటి పార్థసారథి, కృష్ణకుమారి దంపతులు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు జయచంద్ర నాయుడు, జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, హరిప్రసాద్, రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో...

గుడిపాల: మండలంలోని గుడిపాల అన్నా క్యాంటీన్‌లో గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో 191వ రోజు బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లి రవినాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో చీలాపల్లి సర్పంచ్ అరుణ్ కుమార్, టీడీపీ నేతలు సుమతి మురళీ నాయుడు, పళణి, అరుణ్, కిట్టు, సుధాకర్ యాదవ్, గోవింద యాదవ్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 1: స్థానిక కోదండ రామాలయంలో భాద్రపద మాసం రెండో వారం (తై మాసం) సందర్భంగా సీతారాములకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు స్వామి అమ్మవార్ల తలంబ్రాలు, అక్షింతలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల అనుగ్రహం పొందాలని వారు కోరారు.

శ్రీహరిపురంలో బస్ షెల్టరు ఏర్పాటు చేయండి

విజయపురం, ఫిబ్రవరి 1: మండలంలోని శ్రీహరిపురంలో బస్ షెల్టరు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామం నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే వారు ఎండలోనూ, వర్షంలోనూ ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో, రాజకీయ నాయకుల సమావేశాల్లో విజ్ఞప్తి చేసినప్పటికీ ఎవరూ కనికరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నాయకులు, అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈవోను విచారించిన ఏసీ



వీరాంజనేయ స్వామి ఆలయ ఈవోను విచారిస్తున్న ఏసీ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 1: స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయ ఈవో తిమ్మారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై గురువారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనరు ఏకాంబరం విచారణ నిర్వహించారు. ఆలయంలో పని చేస్తున్న గీత అనే మహిళకు నెలవారి వేతనం సరిగ్గా ఇవ్వకుండా, జనవరి ఒకటి నుంచి విధుల్లోకి అనుమతించలేదని ఆమె దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు గురుప్రసాద్‌కు ఇటీవల లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు డీసీ ఈవోను విచారించి నివేదిక పంపాలని ఏసీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఫిర్యాదుదారు గీత, ఈవో తిమ్మారెడ్డిలను విచారించి ఇరువురి అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ ఎత్తిరాజులు, అర్చకులు సుధాకర్ గురుకుల్, ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, కార్యాలయ సిబ్బంది రాధిక, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై స్పృహ కోల్పోయిన అనాథ వృద్ధురాలు

- బంధువుల ఆచూకీ గుర్తులేదంటున్న బాధితురాలు



వృద్ధురాలిని పరామర్శిస్తున్న అమర్‌నాథ రెడ్డి

పూతలపట్టు, ఫిబ్రవరి 1: రోడ్డుపై నడిచి వెళుతున్న ఓ అనాథ వృద్ధురాలు కళ్లు తిరిగి పడిపోవడంతో స్థానికులు ఆమెను సమీపంలోని పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే... గురువారం ఉదయం సుమారు 11 గంటలకు పి. కొత్తకోట గ్రామ సమీపాన రోడ్డు పక్కన నడిచివెళుతూ ఉన్నఫలంగా ఓ 65ఏళ్ల వయస్సున్న వృద్ధురాలు కళ్లు తిరిగి పడిపోయింది. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటిన ఆమెను పి. కొత్తకోట ప్రభుత్వాస్పత్రిలో చేర్పి వైద్యం అందించారు. అనంతరం ఆమె వివరాలను అడుగగా "ఎన్ పేరు కనగమ్మ, ఎనక్కు ఎదువుం న్యాబగమిల్ల..." అని తమిళంలో సమాధానం ఇచ్చింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పద్మజారాణి భర్త అమరనాథ రెడ్డి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి, భోజనం ఏర్పాటు చేశారు.

ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలి

- డీసీసీ అధ్యక్షులు భాస్కర్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1: ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ గురువారం వెదురుకుప్పంలో ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రత్యేక హోదా విషయమై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలను అమలు చేయాలని, పోలవరాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్న డిమాండ్‌తో నిరసన ఉంటుందన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న గిరి గౌడ్ తదితరులు

పూతలపట్టు, ఫిబ్రవరి 1: మండలంలోని వావిల్‌తోట పంచాయతీ ఈడిగపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు రూ.10 వేలు విలువచేసే స్కూల్ బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లను గౌడ సంఘం నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరి గౌడ్, వినోద్‌కుమార్, గజేంద్ర, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు ఎంఈవోగా రాజేంద్రన్

పెనుమూరు, ఫిబ్రవరి 1: పెనుమూరు ఎంఈవో-1గా రాజేంద్రన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బంగారుపాళ్యం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఆయన్ను పలువురు ఉపాధ్యాయ సంఘాలు కలిసి సన్మానించి పరిచయం చేసుకున్నారు.

కొత్తూరులో వైసీపీ ప్రచారం



కొత్తూరులో మాట్లాడుతున్న విజయానంద రెడ్డి

గుడిపాల, ఫిబ్రవరి 1: మండలంలోని మొగరాలపల్లి పంచాయతీ కొత్తూరులో గురువారం వైసీపీ సమన్వయకర్త విజయానంద రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, వైసీపీ నాయకులు మధుసూదన్ రాయల్, ప్రకాష్, కృష్ణమూర్తి, గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, చిట్టిబాబు, కార్మేఘన్, ఏనప్ప, ధీరజ్ పాల్గొన్నారు.

తవణంపల్లె ఎంపీడీవోగా రమణ ప్రకాష్



తవణంపల్లె, ఫిబ్రవరి 1: తవణంపల్లె ఎంపీడీవోగా రమణ ప్రకాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న అబ్దుల్ కలాం ఆజాద్ బదిలీపై నెల్లూరు జిల్లాకు వెళ్లారు. తవణంపల్లె ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న రమణ ప్రకాష్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా కలెక్టరు షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాలలో విద్యార్థులతో పనులు

● ఎంఈవోకు తల్లిదండ్రుల ఫిర్యాదు





పాఠశాలలో వస్తువులు మోస్తున్న విద్యార్థులు

పాలసముద్రం, ఫిబ్రవరి 1: మండలంలోని తిరుమలరాజుపురం ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పాఠశాల గోడలకు రంగులు వేసే పనులను కాంట్రాక్టర్ చేయిస్తున్నారు. పాఠశాలలో ఉన్న డెస్కులు, ఇతర వస్తువులను విద్యార్థులతో మోయించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులు విద్యాబోధన చేయకుండా విద్యార్థులతో పాఠశాలలోని డెస్కులు మోయించి రంగులు వేస్తుండటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

23లోగా గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 1: గంగాధరనెల్లూరు (బంగారెడ్డిపల్లె)కు సమీపంలో గల బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 23వ తేదీలోపు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దమయంతి కోరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు అయితే 1.9.2011 నుంచి 31.8.2015 మధ్య పుట్టినవారై ఉండాలని, ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్‌లు అయితే 1.9.2013 నుంచి 31.8.2015 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. అదేవిధంగా 2022-23 విద్యా సంవత్సరంలో 3వతరగతి, 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి నిరవధికంగా ప్రభుత్వ లేదంటే ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువు పూర్తి చేసి ఉండాలని చెప్పారు. మిగిలిన వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

సొంత భవన వసతి ఎప్పటికో..?

- అసంపూర్తిగా భవన నిర్మాణాలు

- వసతులు లేక ఉద్యోగులకు తప్పని తిప్పలు



అసంపూర్తిగా ఉన్న పచ్చికాపల్లం గ్రామ సచివాలయ, ఆర్బీకే భవనాలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1: ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవన వసతి ఎన్నాళ్లకు కల్పిస్తారో తెలియడం లేదు. వసతులు ఉన్న సొంత భవనం లేక ఉద్యోగులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామ సచివాలయ భవనంపై మరో అంతస్తు నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. అలాగే రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణం (ఆర్బీకే)కు రూ.21.8 లక్షలు మంజూరు చేశారు. ఏళ్లు గడుస్తున్నాయి కానీ, భవన నిర్మాణాలు మాత్రం పూర్తి కాలేదు. దీంతో గ్రామ సచివాలయ ఉద్యోగులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం

పచ్చికాపల్లం ఆర్బీకే, గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం. భవన నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాని మాట నిజమే. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటాం.

- మురళీ, పంచాయతీరాజ్ ఏఈఈ, వెదురుకుప్పం

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో బీడుగా మారిన పొలాలు



ఆమగుంట వద్ద బీడుగా ఉన్న పంట పొలాలు

విజయపురం, ఫిబ్రవరి 1: ట్రాన్స్‌ఫార్మర్ లేక పంట పొలాలు బీడుగా మారాయని మండల పరిధిలోని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెంగమనాయుడు కండ్రిగ, ఎం.అగరం, ఇళ్లత్తూరు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురై నెలలు గడిచిపోయింది. ఈ విషయమై పోలీసులకు, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా, వారు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నిత్యం ట్రాన్స్‌కో అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేకుండా పోయిందని, అధికారుల నిర్లక్ష్యానికి ఈ యేడాది పంటలు వేసుకోలేక పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురై సంవత్సరం కావస్తుంది



మండలంలో ఆమగుంట వద్ద పొలంలో గత సంవత్సరం మే నెల 10వ తేదీన ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగినా ఫలితంలేదు. అధికారుల నిర్లక్ష్యానికి రెండు కారులు పంటలు వేయలేక బీడుగా వదిలేశాను.

- ఆనంద నాయుడు, రైతు, చెంగమనాయుడు కండ్రిగ

కరెంటు సక్రమంగా ఇవ్వడం లేదు



సీఎన్‌కండ్రిగ ఫీడర్‌లో మొదటి షిఫ్టు ఉదయం 4నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండవ షిఫ్టులో ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇస్తారు. కానీ ఈఎల్‌ఆర్ అంటూ ఉదయం 4నుంచి 7:30 వరకు ఇచ్చి, మధ్యలో రెండు గంటల పాటు కరెంటును వృధా చేస్తున్నారు. రైతులకు ఇచ్చే కరెంటును ఒకేసారి ఇవ్వాలి.

- మురళి, రైతు, క్షూరికాపురం

వారంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

మండలంలో గత యేడాది నుంచి కొన్ని టాన్స్‌పార్మర్లు చోరీకి గురి కాగా, మరికొన్ని దగ్ధమయ్యాయి. వాటిలో 20 వరకు రీప్లేస్ చేశాం. మిగిలిన వాటి కోసం నివేదిక పంపాం. వారంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయి.

- వెంకటముని, ట్రాన్స్‌కో ఏడీ

వచ్చే ఎన్నికల్లో చంద్రబాబే సీఎం: దొరబాబు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 1: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబే సీఎం అని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. గురువారం నగరంలోని 27వ డివిజన్ గంగినేని చెరువు, రిలయన్స్‌మార్ట్, 30వ డివిజన్ అశోక్ పురం, కొండమిట్ట తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. టీడీపీ పాలనలో అన్ని వర్గాల వారికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందేవన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్, కటారి హేమలత, కాజూరు రాజేష్, కమలాదయాలన్, వెంకటేష్, బాష, రవి, కోదండ, రామ్మూర్తి, ప్రమీల ఆనంద్, అన్సర్, చక్రి, కమల్, భాను, చిన్ని, చిట్టి, కంద, రాజశేఖర్, జాఫర్, కోడిబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ... ప్రాణానికి రక్షణ: డీటీసీ



జెండా ఊపి ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీటీసీ నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 1: హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ అని డీటీసీ నిరంజన్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుంచి గిరింపేట, ఎమ్మెస్సార్ సర్కిల్, గాంధీ విగ్రహం, కొత్తబస్టాండు, కలెక్టర్ బంగ్లా, ఫారెస్ట్ మీదుగా రవాణా శాఖ కార్యాలయం వరకు నిర్వహించారు. ర్యాలీలో రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీస్, మోటార్ డ్రైవింగ్ స్కూల్, ద్విచక్రవాహన డీలర్లు తదితరులు పాల్గొన్నారు. డీటీసీ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, రాజేశ్వరరావు, మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాద్ వర్మ, భాగ్యశ్రీ, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోలు పాఠశాలలను తనిఖీలు చేయాలి: డీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 1: వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతున్న క్రమంలో ఎంఈవోలు మీ మండలాల్లోని ప్రతి పాఠశాలను తప్పని సరిగా తనిఖీ చేయాలని డీఈవో విజయేంద్రరావు సూచించారు. గురువారం స్థానిక బాలాజీ కాలనీలోని సమావేశ మందిరంలో ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తనిఖీ వివరాలను ఎంఈవోలు డీఈవో కార్యాలయానికి పంపాలని చెప్పారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. సమావేశంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ జయప్రకాష్, సెక్టోరియల్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌కోసం లబ్ధిదారుల పడిగాపులు

నగరి, ఫిబ్రవరి 1: నగరి పట్టణ పరిధిలోని ఇండియన్ గ్యాస్ కార్యాలయం వద్ద గురువారం గ్యాస్ సిలిండర్ల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాశారు. నియోజకవర్గంలోని నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన దీపం పథకం లబ్ధిదారులు నగరిలోని గ్యాస్ గోడౌన్ వద్ద సిలిండర్ల కోసం మండుటెండలో వేచివున్నారు. ఇండియన్ గ్యాస్ రెగ్యులర్‌గా రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఈ సందర్భంగా లబ్ధిదారులు వాపోయారు. నెలకోసారి సిలిండర్లు వస్తున్నాయని, లబ్ధిదారులు 9860 మంది వరకు ఉన్నారని, వీరందరికి ఇక్కడి నుంచే సిలిండర్లు ఇవ్వాల్సి వస్తుండటంతో వారానికోసారైనా గ్యాస్‌సిలిండర్లు రప్పించాల్సి వున్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



సిలిండర్ల కోసం క్యూలో వున్న దీపం పథకం లబ్ధిదారులు

నగరి డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

నగరి, ఫిబ్రవరి 1: నగరి పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా వచ్చినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. 2023లో నాక్ పర్యవేక్షణలో 3.28 సీజీపీఏతో ఆంధ్రప్రదేశ్‌లో ఏ+ సాధించిన రెండవ కళాశాలగా నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచిందన్నారు. ఈ గుర్తింపు దృష్ట్యా ఏపీ ఉన్నత కళాశాల విద్యా కమిషనర్ ఆదేశానుసారం దరఖాస్తు చేయడంతో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ 2024 జనవరి 31 వ తేదీన అటానమస్ కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కోర్సులు, సిలబస్, పరీక్షలు కళాశాల నియంత్రణలో ఉంటాయని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణబాబు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 1: ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు గురువారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, నాయకులు కేశవులు, మురళి, యువరాజు, చంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై బహిరంగ సభ



సభలో మాట్లాడుతున్న అధికారులు

విజయపురం, ఫిబ్రవరి 1: మండల కేంద్రమైన విజయపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం ఉపాధి పనులపై బహిరంగ సభ నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై డిసెంబరు 28 నుంచి జనవరి 10వ తేదీ వరకు గ్రామాలలో తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో గత సంవత్సరం రూ.8,26,87,853లు ఖర్చు చేశారు. వీటిలో వేతనాలకు రూ.6,92,07,908, సామగ్రి కొనుగోలుకు రూ.1,34,79,945 వినియోగించారు. క్షేత్ర సహాయకుల నుంచి రూ. 2,690 రికవరీ చేయగా రూ.3600 అపరాధం వేశారు. డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీడీ శోభన్‌బాబు, ఎంపీడీవో చంద్రమౌళి, ఏఈఈ వీరభద్రం, ఏపీవో బబిత, ఉపాధి సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సరుకుల పంపిణీ



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 1: ఎస్‌ఆర్‌పురం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవి రాజు కుష్ఠు వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామంతో పాటు మంచి ఆహారం తీసుకోవాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారపరాజు కండ్రిగలో తాగునీటి సమస్య



పూడిపోయిన బోరుబావి

విజయపురం, ఫిబ్రవరి 1: మండలంలోని నారపరాజు కండ్రిగలో తాగునీటి సమస్య చోటుచేసుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బోరు బావి పూడి పోయి నీటి కొరత ఏర్పడటంతో రెండు వారాల నుంచి తాగునీటి సమస్య ఏర్పడిందని వాపోతున్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.